క్లుప్తంగా

త్వరలోనే మల్కపేట నుంచి నీటి విడుదల

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: మల్కపేట రిజర్వాయర్ నుంచి 9వ ప్యాకేజీ కెనాల్‌కు నీటి విడుదలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అంగీకరించారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్లలో ప్రభుత్వ విప్‌ను కలిసి నీటి సమస్యను వివరించినట్లు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పంట పొలాలు ఎండిపోతున్నాయని విప్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేర బేగం, వైస్‌చైర్మన్ గుండాటి రామ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, గంట బుచ్చగౌడ్, చెన్నిబాబు, బండారు బాల్‌రెడ్డి, నంది కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ పార్క్‌లో యోగా శిక్షణ

వేములవాడ: రథసప్తమిని పురస్కరించుకొని వేములవాడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మున్సిపల్ పార్క్‌లో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. సామూహిక సూర్య నమస్కారాలు, సూర్యునికి కృతజ్ఞత–గౌరవ వందనం, సూర్యుని విశిష్టత, ప్రతిఒక్కరికీ అమృతాహారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అందరూ ఆహ్వానితులేనని, పురవాసులు పెద్ద ఎత్తున హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

పెటా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి, నాయకులు

సిరిసిల్ల: రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను డీఈవో జగన్మోహన్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదం చేసే కార్యక్రమాల నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దుప్పటి రవికుమార్, నాయకులు నాంపల్లి శ్రీనివాస్, తడుకల శ్యాంసుందర్, ఎస్.రాజు, సంధ్యారాణి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం

చందుర్తి: బీజేపీ చందుర్తి మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మెకిలే విజేందర్ తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శులుగా షిరిడి మల్లేశం(చందుర్తి), పేరుక గంగరాజు(నర్సింగపూర్), ఉపాధ్యక్షులుగా లోకోజు సతీశ్(మల్యాల), ఎల్లాల తిరుపతిరెడ్డి(రామారావుపల్లె), మట్కం మల్లేశం(చందుర్తి), చింతకుంట గంగాధర్(నర్సింగపూర్), కార్యదర్శులుగా అయోధ్య పర్శరాములు(జోగాపూర్), కొక్కుల నరేశ్(లింగంపేట), నాయిని బాపురెడ్డి(మర్రిగడ్డ), పత్తిపాక శ్రీనివాస్(మల్యాల), గంగిపెల్లి మల్లేశం(సనుగుల), కార్యవర్గ సభ్యులుగా నక్క మల్లేశం(మూడపల్లి), మ్యాకల బద్రి(బండపల్లి), గోస్కుల కమలాకర్(మూడపల్లి), కర్రెల్ల శ్రీనివాస్(కిష్టంపేట)లను నియమించినట్లు పేర్కొన్నారు.

బీజేవైఎం కోనరావుపేట మండల శాఖ..

కోనరావుపేట: బీజేవైఎం కోనరావుపేట మండల ఉపాధ్యక్షుడిగా పొన్నం మహేశ్, ప్రధాన కార్యదర్శులుగా ఎక్కల్‌దేవి జలేందర్, గుండా శ్రీకాంత్, కార్యదర్శిగా వాసాల అక్షయ్‌రెడ్డిలను నియమించినట్లు మండల శాఖ అధ్యక్షుడు చల్ల జితేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఎన్నిక



రుద్రంగి: ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోషియేషన్ రుద్రంగి మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేశవేణి భూమేశ్, ఉపాధ్యక్షుడిగా తన్నీరు వేణు, కోశాధికారిగా పడాల శ్రీధర్, కార్యదర్శిగా రోమాల అశోక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లిలో కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మనస్విని, తేజ సోమవారం ఆరుబయట ఆడుకుంటుండగా.. కుక్కలు అకస్మాత్తుగా వచ్చి, దాడి చేశాయి. సమీపంలో ఉన్నవారు వాటిని తరిమివేయడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. గాయపడిన చిన్నారులను ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువైందని, అధికారులు వాటిని దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

కూడళ్లు.. ప్రమాద నిలయాలు

- వేములవాడలో పెరుగుతున్న ట్రాఫికర్
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- భక్తుల రద్దీ.. కనిపించని సౌకర్యాలు
- పట్టించుకోని అధికారులు



వేములవాడలో ప్రమాదకరంగా బైపాస్ రోడ్డు చౌరస్తా

వేములవాడ అర్బన్: ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడలో ప్రధాన కూడళ్లు ప్రమాదకరంగా మారాయి. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా కూడళ్లను అభివృద్ధి చేయకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు వాహనదారులు ఇష్టారీతిన వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన కూడళ్లను విస్తరించడంతోపాటు సుందరీకరించాల్సిన గత పాలకులు పట్టించుకోకపోగా.. అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు.

తిప్పాపూర్ తెలంగాణ చౌక్‌లో..

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ తెలంగాణచౌక్ వద్ద చౌరస్తా ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ వేములవాడ-సిరిసిల్ల-కరీంనగర్-వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ నాలుగు దారులకు వెళ్లే రహదారులు ఉన్నాయి. ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తుందో తెలియక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు త్రుటిలో తప్పుతున్నాయి.



తిప్పాపూర్‌లో తెలంగాణ చౌక్ చౌరస్తా పరిస్థితి

మూలవాగు బైపాస్ చౌరస్తా

వేములవాడ మూలవాగు బ్రిడ్జి అవతల బైపాస్‌రోడ్డు చౌరస్తాలో అదే పరిస్థితి. వేములవాడ బస్టాండ్ వైపు, మొదటి బైపాస్, రెండో బైపాస్, రాజన్న గుడి వైపు, నాలుగు రహదారులు కలిసే చౌరస్తా ఉంది. ఇక్కడ కూడా ఏ వాహనాలు ఎటు నుంచి వస్తున్నాయో తెలియడం లేదు. వేములవాడ బస్టాండ్ నుంచి రాజన్న గుడి వైపు నడిచే పాదాచారులు కూడా ఉంటారు. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఒక్క వాహనం ఆగితే చాలు భారీ ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. ఇప్పటికైనా చౌరస్తా వద్ద కూడళ్ల సుందరీకరణ చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఆగిన బ్రిడ్జి పనులు

వేములవాడ మూలవాగుపై గతంలో రెండు వంతెనల పనులు ప్రారంభించారు. ఒక బ్రిడ్జి పని పూర్తయి, రాకపోకలు కొనసాగుతున్నాయి. మరో బ్రిడ్జి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఆ బ్రిడ్జి పనులు ప్రారంభించి పూర్తిచేస్తే వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు పేర్కొంటున్నారు. బ్రిడ్జి పనులు పూర్తి చేసి, రెండు వైపులా కూడళ్లు నిర్మిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడవు.

నిత్యం ట్రాఫిక్‌జామ్



తిప్పాపూర్, మూలవాగు బ్రిడ్జిపై ఇరుకురోడ్డు ఉండడంతో నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతుంది. రోడ్లు విస్తరించి, కూడళ్లను అభివృద్ధి చేయాలి. – కనకయ్య, నాంపల్లి

కూడళ్లను సుందరీకరించాలి



వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ తెలంగాణచౌక్ వద్ద, మూలవాగు బ్రిడ్జి అవతల బైపాస్‌రోడ్డు కలిసే చౌరస్తాలో ప్రధాన కూడళ్లను సుందరీకరించాలి. ట్రాఫిక్‌జామ్ ఏర్పడదు. – మైలారం శ్రీనివాస్

బ్రిడ్జి నిర్మించాలి



మూలవాగు బ్రిడ్జి నిర్మించాలి. అప్పుడే వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయి. రాజన్న గుడికి పాత బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్లే అవకాశం ఉంటుంది. – శ్రీనివాస్, తిప్పాపూర్

వసంత పంచమి వేడుకలు



బండపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



ధర్మారం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, పిల్లలు

వేములవాడ అర్బన్: వేములవాడ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సుమారు 80 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. హెచ్‌ఎం చిలుక గట్టు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలంలోని ఆలయాల్లో వసంత పంచమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సరస్వతి దేవికి పూజ చేశారు. టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. సరస్వతి మాత చిత్రపటాలను పూలతో అలంకరించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

చందుర్తి: బండపల్లి అంగన్‌వాడీ రెండో కేంద్రంలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. టీచర్ రేణుక చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఉపాధ్యాయులు మంజుల, సంధ్య, అనిత, జ్యోతి, తల్లుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని వాణినికేతన్, శ్రీవాణి పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అఘోరీ హల్‌చల్



కారులో అఘోరీ

తంగళ్లపల్లి: సిద్దిపేట–రాజన్నసిరిసిల్ల జిల్లాల సరిహద్దు గ్రామం జిల్లెల్ల శివారులో సోమవారం అఘోరీ హల్‌చల్ చేసింది. వేములవాడ ఆలయంలోని దర్గాను ఫిబ్రవరి 3న కూల్చివేస్తానని దమ్ముంటే ఆపాలని ఇటీవల సవాల్ విసిరిన విషయం తెలిసిందే. సవాల్ విసిరినట్టుగానే అఘోరీ వేములవాడకు వచ్చే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమై జిల్లా సరిహద్దు వద్ద సోమవారం సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్, సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. సాయంత్రం 4.30 గంటలకు జిల్లెల్ల శివారుకు చేరుకున్న అఘోరీ కారును పోలీసులు అడ్డుకోగా.. దాదాపు మూడు గంటలపాటు హైడ్రామా చోటుచేసుకుంది. చివరికి రాత్రి 7 గంటల సమయంలో టోవింగ్ వెహికిల్ తెచ్చి సిద్దిపేట జిల్లా దుద్దెడ టోల్‌గేట్ వద్ద వదిలేశారు. అక్కడి నుంచి అఘోరి హైదరాబాద్ వైపు వెళ్లిపోయారు.

లక్షల డప్పులు–వేల గొంతులు సభకు రండి

తంగళ్లపల్లి: ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు–వేల గొంతులు మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య మాదిగ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తాడూర్ చౌరస్తాలో సోమవారం సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర నాయకుడు అవునూరి ప్రభాకర్, జిల్లా కో-కన్వీనర్ సావనపెల్లి రాకేశ్, దండోరా కళామండలి జిల్లా ఉపాధ్యక్షుడు పసుల దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి అవునూరి రమేశ్, ఉపాధక్షుడు మహంకాళి రవి, గౌరవ అధక్షుడు లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు–వేల గొంతులు మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ వీర్నపల్లి మండల అధ్యక్షుడు గద్దరాశి భగవంతం కోరారు. మండల కేంద్రంలో సంబంధిత పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. నాయకులు చంద్రయ్య, దేవయ్య, రాజం, అశోక్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బడితండా మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రేఖ

రుద్రంగి: బడితండా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా జిందం రేఖ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా విధులు నిర్వహించిన ఆమె కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు బడితండా పీహెచ్‌సీలో విధుల్లో చేరారు. ఆస్పత్రి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మండల ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఆమెను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

‘వీర సముద్రం’ కట్ట కబ్జాపై చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్: పోతుగల్ వీరసముద్రం చెరువు కట్ట కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రైతు నాయకుడు అనమేని రాజు కోరారు. ఈ మేరకు సోమవారం నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పోతుగల్‌కు చెందిన పర్శరాములు చెరువు కట్టను తవ్వి, తూము కాలువను పూడ్చివేసి, స్థలాన్ని కబ్జా చేశాడని, విచారణ జరపాలని విన్నవించారు.

రీడింగ్ క్లబ్ ప్రారంభం



రీడింగ్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న రచయిత వారాల ఆనంద్, ప్రిన్సిపాల్ లావణ్య

వేములవాడరూరల్: శాత్రాజుపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రీడింగ్ క్లబ్‌ను ప్రముఖ కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ సోమవారం ప్రారంభించారు. విద్యార్థుల్లో పఠనాభిలాషను పెంపొందించడానికి ఈ క్లబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, అధ్యాపకులు, లైబ్రేరియన్ శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

6 నుంచి ఎస్సెస్సీ ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్

ఇల్లంతకుంట: ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు ఎస్సెస్సీ ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నట్లు ఇల్లంతకుంట ఎంఈవో శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 6న తెలుగు, 7న హిందీ, 10న ఆంగ్లం, 11న గణితం, 12న ఫిజికల్ సైన్స్, 13న బయాలాజికల్ సైన్స్, 15న సాంఘిక శాస్త్రం పరీక్షలు మధ్యాహ్న 12.15 గంటల నుంచి జరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరీక్ష పేపర్లను మండల వనరుల కేంద్రం నుంచి తీసుకెళ్లాలని సూచించారు.

పవర్ కట్ ప్రాంతాలు

బోయినపల్లి: వేములవాడ మండలం వట్టింల 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున బోయినపల్లి మండలంలోని కోరెం, మల్కాపూర్, స్తంభంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఏఈ ప్రశాంత్ తెలిపారు. మల్కాపూర్, అనంతపల్లి, తిప్పాయిపల్లి, నల్లగొండ, కోరెం, బూర్గుపల్లి, స్తంభంపల్లి, దుంద్రపల్లి, గుండన్నపల్లిలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గణపతి హోమం

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయం వద్ద సోమవారం గణపతి హోమం నిర్వహించారు. భక్తులకు ఇల్లంతకుంట వైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మూగు నాగరాజు శర్మ, గురుస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం బోయినపల్లి మండలంలోని వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జయశీల ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితా ప్రచురణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: ఇందిరమ్మకాలనీకి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మామిడాల శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున రూ.2 లక్షల చెక్కును సోమవారం అందజేశారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మాజీ ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోడి అంతయ్య తదితరులున్నారు.

నేత కార్మిక కుటుంబానికి సాయం

ముస్తాబాద్: మండల కేంద్రానికి చెందిన నేత కార్మికుడు బిట్ల సంతోష్ అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం రూ.11 వేల ఆర్థికసాయం అందించారు. జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సర్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, నాయకులున్నారు.

పీఎంపీ క్లినిక్ సీజ్



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

రుద్రంగి: ఇష్టారీతిన వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పీఎంపీ వైద్యుడు శీలం మీనయ్యపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ‘సాక్షి’లో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెండో రోజు వైద్య, రెవెన్యూ, పోలీస్ అధికారులు పీఎంపీ క్లినిక్‌ను తనిఖీకి చేసేందుకు వెళ్లారు. రెండో రోజూ క్లినిక్ మూసివేసి పరారీ కావడంతో సీజ్ చేశారు. చందుర్తి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.వేదాచారి, ఎంహెచ్‌పీ అర్చన, ఏఎన్‌ఎం విజయ, లావణ్య, ఆర్‌ఐ శ్యామ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సాక్షి ఎఫెక్ట్

రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు

- ఈఈ వెంకటరమణయ్య

ముస్తాబాద్: ముస్తాబాద్–మోహినికుంట రహదారి విస్తరణ పనులకు ప్రతిపాదనలు పంపించామని ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటరమణయ్య తెలిపారు. ‘రోడ్డు విస్తరణ ఎప్పుడో’ శీర్షికన ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. 5 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అప్పటిలోగా మరమ్మతులు చేపడుతామని పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసనలు



ధర్నా చేస్తున్న స్కావెంజర్లు, ఏఐటీయూసీ నాయకులు

సిరిసిల్లటౌన్: జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసనలు వెల్లువెత్తాయి. కార్మికులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వరుస కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ చేపట్టిన ఆందోళనలతో కలెక్టరేట్ ప్రాంగణం హోరెత్తింది.

స్కావెంజర్ల సమస్యలు తీర్చాలి..

ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ అండ్ స్కావెంజర్స్ 6 నెలలుగా జీతాల్లేక పస్తులుంటున్నారని ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇప్పటివరకు జీతాలు ఇవ్వలేదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎంఈవోల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, వేతనాలను నేరుగా కార్మికుల ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి..

పౌరహక్కుల దినోత్సవానికి గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలకు చేరేలా చేసి, అంటరానితనం, కులవివక్ష నిర్మూలనకు చైతన్యం కల్పించాల్సిన అధికారులే ఈ కార్యక్రమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్, లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, అంబేడ్కర్ యువజన సంఘం యూత్ అధ్యక్షుడు మాసం సుమన్, నాయకులున్నారు.

పరిహారం వెంటనే ఇవ్వాలి

మధ్యమానేరులో ముంపునకు గురైన తమకు పరిహారం వెంటనే ఇవ్వాలని చీర్లవంచ బేడబుడగ జంగాలవారు కోరారు. మిడ్‌మానేరు ముంపు బాధితుల ప్రతినిధి చల్ల బాలరాజు మాట్లాడుతూ.. గ్రామంలోని 5, 6, 7, 12వ వార్డుల్లో బేడబుడగ జంగాల ప్రజలు నివసిస్తుంటారని తెలిపారు. వీరు సంచార జీవనం సాగిస్తుండటంతో ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. ఈ విషయంలో విఫలమవుతున్న అధికారులపై కేసు నమోదు చేయాలన్నారు. బాధితులు లంచం ఇవ్వకపోవడం వల్లే పరిహారం అందడం లేదని ఆరోపించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి, వారికి న్యాయం చేయాలని కోరారు.

మా భూములు ఇప్పించాలి..

వేములవాడ అర్బన్ మండలం నాంపెల్లి శివారులోని 139.5 ఎకరాల లావణి పట్టా భూములను కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు ఆక్రమించుకున్నారని పల్లెగుట్ట రైతు భూమి పరిరక్షణ సేవా సమితి రైతులు తెలిపారు. ఆ భూముల్లో 1992లోనే అప్పటి కాంగ్రెస్ సర్కారు తమకు పట్టాలిచ్చిందని పేర్కొన్నారు. 250 కుటుంబాలకు ఇవే ఆధారమని, భూములను తమకు ఇప్పించాలని కోరారు. వేల్పుల రాజేందర్, దండుగుల లక్ష్మీరాజం, బాలరాజు, పర్శరాం తదితరులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు.

వైభవం.. రాధాకృష్ణుల కల్యాణం




తాళిబొట్టు చూపుతున్న వేద పండితుడు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి శ్రీ గీతా మందిరంలో సోమవారం శ్రీ మద్భగవద్గీత సేవా సమితి 35వ, గీతా మందిరం 25వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం రాధాకృష్ణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, నిత్యహవనం, జ్ఞానసప్తకం, మహాపూర్ణాహుతి, స్వామివారి రథోత్సవం జరిపారు. మహిళా భక్త బృందం భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాచర్ల రఘురామశర్మ, పాలెపు రవీందర్‌శర్మ, కాలనాథభట్ల, మణికంఠశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గీతా మందిరం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, సభ్యులు రామ్‌రెడ్డి, చేపూరి శ్రీకర్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


కోనరావుపేట: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా పట్టించుకోవడం లేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్‌కుమార్ ఆరోపించారు. కోనరావుపేట మండల కేంద్రంలో సోమవారం ఫెడరేషన్ మండల స్థాయి మహాసభను స్థానిక ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల అధ్యక్షుడిగా చెల్మల రాహుల్, కార్యదర్శిగా పిట్టల రాకేశ్‌లను ఎన్నుకున్నారు. నాయకులు ప్రవీణ్, మహమ్మద్ షాదుల్లా, షఫీ, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



ముస్తాబాద్: ఆవునూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రేగుల సాహితి రాష్ట్రస్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. ఆమెను గ్రామస్తులు సోమవారం సన్మానించారు. పిట్ల రాజు, పిట్ల చంద్రం, రేగుల దేవరాజు తదితరులున్నారు.

గీతా ప్రవచనకర్తలకు సత్కారం



సిరిసిల్ల: భగవద్గీత ప్రాశస్త్యాన్ని సామాన్యులకు చేరవేస్తున్న ప్రవచనకర్తలు, గీతా ప్రచార సమితి అధ్యక్షుడు కోడం నారాయణ, ప్రతినిధి జనపాల శంకరయ్యలను చిన్మయ మిషన్, ఆశ్రమ కమిటీ ప్రతినిధులు సోమవారం సిరిసిల్లలో సత్కరించారు. పత్తి పాక హరికిషన్, మోతీలాల్, నల్ల సత్యనారాయణ, గాయత్రీ పరివార్ అధ్యక్షుడు బాదం ప్రకాశ్, గజ్జెల్లి రామచంద్రం, వేముల బక్కయ్య, మేర్గు లక్ష్మణ్, మల్లేశం, జక్కని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.